

గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
మేఘన
కోరం కిషోర్
IRAS



ఉదయం ఐదు గంటల సమయం...

మంచి నిద్రలో ఉన్నాడు హరి...

ఇంతలో...

ఎవ్వరో... చటుక్కన హరి గుండెల మీదకెక్కి కూర్చున్నారు...

చాలా బరువుగా ఉన్నాడా మనిషి...

ఆ మనిషి తన బలమైన రెండు చేతులతో హరి గొంగు నులమడం మొదలుపెట్టాడు...

ఊపిరాడడం లేదు హరికి...

తన గొంతు నులుముతున్న ఆ కబంధ హస్తాలను తొలగించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు...     ఉక్కులాంటి బలమైన ఆ చేతులను విడగొట్టాలని శాయశక్తులా ట్రై చేస్తున్నాడు.

అరవాలనుకుంటున్నాడు... కానీ.. గొంతులోని అరుపు బయటకు రావడం లేదు ... అరిచానను కుంటున్నాడు... కానీ కంఠంలోనే నిక్షిప్తమైన విషయం తెలుస్తూనే ఉంది.

ఉండేకొద్దీ ఊపిరి బలహీనమైపోతోంది. ఆ చేతుల పట్టు ఉండేకొద్దీ ఉడుంపట్టులా ఇంకా.. ఇంకా బిగుసుకుంటున్నది. పోరాడుతున్నాడు హరి... పోరాటం... ఆరాటం... ఎంతసేపు ఆ పోరాటం జరిగిందో తెలియదు... ఆఖరు ప్రయత్నంగా... తన బలమంతా వినియోగించి, పెద్దగా అరుస్తూ, ఒక్కసారిగా తనపైనున్న మనిషిని అమాంతంగా తోసేసాడు.

గుండెల మీద బరువు తొలగిపోయింది.

శ్వాస అతివేగంగా తీసుకుంటున్నాడు.

గుండె గొంతులో కొట్టుకుంటున్న శబ్దం అతి స్పష్టంగా వినిపిస్తున్నది.

గుండెలు డవిసిపోయి, గొంతు పూర్తిగా తడారిపోయి, నాలుక పిడచకట్టుకుపోయింది.

మైండ్‌బ్లాక్‌అయిపోయింది.

చటుక్కున లేచి కూర్చుని, లైటు వేసాడు ఆలస్యం చేయకుండా...

ఒక్కసారిగా గదంతా వెలుతురు పరచుకుంది..

ఎవరూ..? ఎవరా మనిషి? ఎందుకు నన్ను చంపాలనుకున్నాడు?

ప్రశ్నలు మస్తిష్కాన్ని తొలచివేస్తుండగా, గదంతా తేరిపార చూసాడు.

అక్కడెవరూ లేరు...

అదేమిటి? ఇంతలోనే అంత బరువైన, అంత బలమైన మనిషి ఎలా పోయాడు? ఎక్కడకు మాయమైపోయాడు? ఇది సాధ్యమా? ఆ బరువు... ఆ గొంతు నులమడం, ఆ బలమైన ఉక్కువంటి కబంధ హస్తాలు... అంతా కలా? భ్రమా? కాదు...

కానేకాదు...మరేమిటి?దయ్యమా..? భూతమా..? చంపాలనుకున్నది. మరెందుకు వదిలేసింది..? ఎలా మాయమైపోయింది..?దయ్యాలు, భూతాలు మనిషిని చంపదలచుకుంటే.. వాటిని మనిషి ఆపగలడా..? వాటి బలం ముందు, శక్తి ముందు మానవుల శక్తి ఏ పాటిది..?

ఇంకా చెమటలు ధరగా కారుతూనే ఉన్నాయి.. ఎన్నిసార్లు వేళ్లతో విదిలించినా నుదిటి మీద నుండి చమటలు కారుతూనే ఉన్నాయి. నిశ్శబ్దంగా పనిచేస్తున్న స్ప్లిట్ఏసి శబ్దం భయంకరంగా వినిపిస్తున్నది... పడుతున్న చెమటల్ని ఏసి చల్లదనం ఏమాత్రం పారద్రోలలేక పోతున్నది.

పడుకునే ముందు మంచం దగ్గరే పెట్టుకున్న వాటర్బాటిల్మూత తీసి, గబగబా సగం బాటిల్పైనే గడగగా తాగేసాడు. కొన్ని నీళ్లు చళ్లు చళ్లున ముఖంపై కొట్టుకున్నాడు.

కప్పుకున్న దుప్పటి సగంపైగా చమటతోనే తడిసి ఉంది. మంచం దిగి గదంతా కలియదిరిగాడు... ఏమీలేదు... ఏమైంది?

ఏమైందసలు?

కొద్దిగా స్థిమితపడి, మంచం మధ్యలో కూర్చున్నాడు... అంతలోనే...

ఆ అచేతనావస్థలోనే... ఆ నిద్రావస్థలోనే... హరి ముఖంపై చిరు దరహాసం మొలిచింది... ఆలోచనలు రేసుగుర్రాల్లా పరుగులుతీస్తుండగా... ఆ చిరునవ్వు ఇంకొంచం పెద్దదయింది.

హౌ స్టుపిడ్ఐయాం? వాటే థరో విలేజర్ఐయామ్? చిన్నతనమంతా గ్రామంలోనే గడిచింది, ఆ భయాలు, ఆ నమ్మకాలు, ఆ ఛాయలు, వాసనలు, ఎంత గాఢంగా నాలో నాటుకుపోయాయి? డాక్టర్నయినా గానీ ఇంకా నన్ను వదలకుండా ఎంతగట్టిగా అంటిపెట్టుకున్నాయి?

"ఈ గుండెల మీద మనిషి కూర్చోవడం, గొంతు నులమడం, ఊపిరాడకపోవడం... ఇదంతా.. సరిగ్గా, సరియైన పొజిషన్‌లో పడుకోకపోవడం వలన, నిద్రలో, శ్వాసక్రియ సరిగ్గా జరగకపోవడం వలన, ఊపిరి సరిగ్గా అందకపోవడం వలన, సాధారణంగా, అందరికీ జరిగే అనుభవమే..."

అంతే... అంతకంటే ఏమీ లేదు.

వరసగా, ఒకదాని వెంబడే ఇంకొకటిగా రకరకాల ఆలోచనలు హరిని కమ్ముకోవడం మొదలుపెట్టాయి. ఏడేళ్ళ వయసులో... రఘుగాడు మాటలు మదిలో మెదిలాయి.

"ఒరే... కొరివి దయ్యాలు తెలుసురా, నీకు? అవి మనుషులకు కీడు చేయ్యవు, కానీ వాటికి మనుషులను ఏడిపించడమంటే చాలా సరదా, మనిషిని నానా అవస్తలకు గురిచేసి, ఆ మనిషి పడే తిప్పలు చూసి, భలే సంతోషపడతాయి, నవ్వుకుంటాయి."

"ఒకతను ఇంటి బయట నులక మంచం వేసుకుని పడుకుంటే, ఆ మంచాన్ని మనిషితో పాటు, ఓ హోం, ఓ హోం అనుకుంటూ గాల్లో ఎత్తుకుపోయి, ఊరి చివర పొలాల్లో వదిలాయంట... పొద్దున్నే పొలంలో నిద్రలేచి, ఆ మనిషి పడిన కంగారూ, వేసిన కేకలు, పంచ ఊడిపోయేలా వేసిన గంతులూ చూసి, కడుపుబ్బ నవ్వుకున్నాయంట."

"ఈ దయ్యాలను మనిషి కంట్రోల్‌చేయవచ్చు. వాటిని గమనించనట్టు, నిద్రపోతున్నట్లు నటిస్తూ, తెలివిగా, ఒక దయ్యం తల వెంట్రుక నొకదాన్ని లాగి గుప్పెట్లో పెట్టుకుంటే... నా... సామిరంగా... మనం చెప్పే పనులన్నీ చచ్చినట్లు చేసిపెడతాయి. ఎక్కువ

కాలం మనం వాటిని కంట్రోల్

చెయ్యలేము. మనకి కావలసిన పనులన్నీ చేయించుకోగానే, ఉఫ్‌మని, గుప్పెట్లో వెంట్రుకని ఊదేస్తే, వెంటనే పారిపోతాయి.''

ఇక మామూలు దయ్యాల విషయానికిస్తే...

''ఊరి పొలమేరల దగ్గర దయ్యం వెంటబడుతుంది, దాన్ని మనం చూసినా, చూడనట్టుగా నటిస్తూ... మామూలుగా నడుస్తుండాలి... కాసేపటికి, అది గమనించేలోగా దానికి అందనంత దూరం పరుగెట్టి, తిరిగి దయ్యం దగ్గరకొచ్చేలోపు గుండ్రంగా మూత్రం పోసేసి ఆ మధ్యలో మనం నిలబడిపోవాలి. అంతే... ఇక దయ్యం లోపలికి రాలేదు... కాని ప్రయత్నం చేస్తుంటుంది, మీద పడిపోవాలని.. ఈ లోగా కుడిచేత్తో, ఒకే ఒక పట్టుతో నడుముకున్న మొలతాడుని పుటుకున్న తెంపేసి, దాన్ని చేతిలో బిగించి పట్టుకుని, కొరడాలా రaుళిపిస్తూ దయ్యాన్ని కొట్టాలి. ఛళ్ళు...

ఛళ్ళుమని దయ్యానికి ఆ దెబ్బలు తగిలి, ఆ దెబ్బలు తట్టుకోలేక, బాధ భరించలేక, దయ్యం పారిపోతుంది. వెళ్ళిపోయేటప్పుడు 'నల్ల కుక్క' రూపంలో గాని 'నల్ల పిల్లి' రూపంలో గానీ వెళ్ళిపోతుంది.''



జరిగిన కథ:

మంచి నిద్ర లో వున్న హరికి ఎవరో తన గుండెల మీద కూర్చున్నట్టు, తన గొంతు నులిమినట్టు అనిపిస్తుంటుంది. తరువాత నిద్రలోంచి అమాంతం లేచి ఎవరబ్బా అని ఆలోచించి దయ్యాలుకావు, భూతాలు కావు అని తనకు తానే సర్ది చెప్పుకుంటాడు. చిన్నప్పుడు తన స్నేహితులు చెప్పిన విషయాలన్నీ గుర్తుతెచ్చుకుంటాడు.

............................తరువాత..

రఘు ఆలోచనల్లోంచి బయటపడి, నెమ్మదిగా చేయిసాచి తడుముకున్నాడు హరి...

మొలతాడు...

ఉంది. ఎప్పుడు కట్టిందో... తాతయ్య మొదటిసారి కట్టిన గుర్తుంది... మళ్లీ ఆలోచనల్లోకి జారిపోయాడు హరి.

ఎరుపు, పసుపు, నలుపు రంగుల్లో దొరికే మొల్తాడుల్లో నలుపు రంగు మంచిదనేది నాయనమ్మ.

గ్రామస్తులు కూడా నలుపురంగు దిష్టి తీస్తుందని నలుపు రంగునే వాడేవారు. రఘు గాడయితే మొల్తాడును ముప్పేట (మూడు పేటలుగా) అల్లేవాడు. తాతయ్య మాత్రం ముప్పేట మొల్తాడును ఇష్టపడేవాడు కాదు. ఎంత శుభ్రం చేసినా ఎంతో కొంత మురికి మిగిలిపోతుందనేవాడు.ఈ మొల్తాడు నిక్కరు జారిపోకుండా కాపాడుతుంది. ఈ నిక్కర్లెందుకు ఎప్పుడూ జారిపోతూ ఉంటాయి? అసలెవరు కనిపెట్టారీ మొల్తాడు? ఎందుకు కనిపెట్టారు?

‘‘చేత వెన్న ముద్ద.. చెంగల్వ పూదండ, పట్టుదట్టి, బంగారు మొలతాడు’’ అని చిన్ని కృష్ణుణ్ణి వర్ణిస్తున్న పద్యం ఎంత బాగుటుందీ...

ఠంగ్.... ఠంగ్... ఠంగ్...

నిశ్శబ్ద నిశీధిలో సమ్మెట దెబ్బల్లాగా గోడ గడియారం కొట్టిన గంటల శబ్దానికి ఒక్కసారిగా ఇహలోకంలోకి వచ్చిపడ్డాడు హరి...

ఓ మై గాడ్...!

తయారవ్వాలి, హాస్పటల్‌కు వెళ్లాలి, పేషంట్లు... ఆపరేషన్లు... వార్డులు... రౌండ్లు... ఇతర డాక్టర్లతో డిస్కషన్లూ... అదో ప్రపంచం... ఒక్కసారి అడుగుపెడితే మళ్లీ ఎప్పుడు బయటపడతామో తెలియదు.

గబగబా లేచి, వంట గదిలోకి వెళ్లి కాఫీ కలుపుకుందామని... హాల్ వైపు అడుగులేసాడు.

అందరి జీవితాల్లోనూ ఇదో రొటీన్...

హాలు దాటి, మెయిన్ డోర్ తీసి, డోర్ బయట వేళ్లాడ గట్టిన సంచిలో పాలపాకెట్లు, పేపర్... అందుకుంటూ హాల్లోకి అడుగుపెడుతుండగానే ఏదో 'అనీజి' ఫీలింగ్ హరిని కమ్ముకున్నది. మెడ వెనుక రోమాలు నిక్కబొడుచుకున్నట్లు అనిపించింది. అడుగు ముందుకు వేయాలన్పించలేదు. హాల్లో లైటు వెలగడం లేదు. బెడ్‌రూంలోని లైటు వెలుతురు హాల్లోకి ప్రవేశించలేకపోతున్నది, కానీ కొంతవరకు చిరుచీకటితో పోరాడగలుతున్నది.

ఆ చిరు చీకట్లో...

హాలు మధ్యలో... స్టూల్... ఆ స్టూల్ మీద ఏదో ఆకారం కూర్చుని ఉన్నట్లుగా... కళ్ళు చికిలించి... చూడగా... స్త్రీమూర్తి ఆకారం లాగా, లీలగా కనబడుతున్నది. మళ్లీ భ్రమా..? ఈ రఘుగాడి దెయ్యాల వాగుడు ప్రభావమా..? నాకేమన్నా మతి చలించిందా..? నాలో ఫిజియోలాజికల్ ఛేంజెస్

(రసాయనాల మార్పులు) సడన్‌గా చోటు చేసుకన్నాయా నాకు తెలికుండానే..?

ఆలోచనలు కట్టిపెట్టి, గబుకున్న హాల్‌లోని లైటు స్విచ్ నొక్కాడు.

ఒక్కసారిగా హాలంతా దేదీప్యమానమయింది. అంతా స్పష్టంగా కనబడుతున్నది.

నిజమే...

"హాలు మధ్యలో... స్టూలు మీద... ఒక ముసలామె కూర్చుని ఉంది. ముగ్గుబుట్ట లాంటి తెల్లని తల వెంట్రుకలు, అక్కడక్కడా చిరిగి, మాసికలు వేసిన చీర, ముడతలుపడిన ముఖం, చేతులు, పెరిగి ఉన్న గోళ్లు కలిగి, దీనంగా హరి వైపే చూస్తున్నది."

హఠాత్తుగా, వేళకాని వేళ, ఒక ముసలమ్మ నట్టింట్లో సాక్షాత్కరించింది.

కలా..? కలకాదు.... వాస్తవం...

నిలువునా కొయ్యబారిపోయాడు హరి...

రాత్రి పడుకునే ముందు మెయిన్ డోర్ బోల్ట్ పెట్టానే...! ఏమో..? పెట్టాననుకుని మర్చిపోయానేమో..? బోల్ట్ పెట్టడం మర్చిపోతే మాత్రం, సరాసరి ఫ్లాట్‌లోకి వచ్చెయ్యడమేనా..?

ఎందుకు దీనంగా నా వైపు చూస్తున్నది?

కొద్దిగా తేరుకుని, కోపంగా ఏదో అనబోతున్న హరి వైపు సూటిగా, దీనంగా చూస్తూ...

"బాబూ... నీ హాలు, కిచెన్, బాత్‌రూమ్ అన్నీ శుభ్రం చేసేసాను. అంట్లు అన్నీ తోమేసాను... నీ స్నానానికి వేడినీళ్లు తయారుగా ఉంచాను. ఇంకా నువ్వేపని చెప్పినా చేస్తాను. నాకు సహాయం చెయ్యి నాయానా."అంటూ.. హరిని దీనాతి దీనంగా అర్థించడం మొదలుపెట్టింది.

"తలుపు తీసి ఉంటే... ఎవరింట్లోకి బడితే వాళ్ల ఇంట్లోకి చొరబడిపోతావా? ఇల్లు కడిగేస్తావా? ఇంట్లు తోమేస్తావా? నిన్నెవరు చెయ్యమన్నారా పనులు..? పని మనిషి పెట్టుకోవాలంటే నేనెప్పుడో పెట్టుకుని ఉండేవాడిని.. నా పనులు నేను చేసుకోగలను. నీ సహాయం

నాకవసరం లేదు. పొద్దున్నే నా మూడ్ అంతా చెడగొట్టావ్... వెళ్ళు.. వెళ్ళిపో." అంటూ పెద్ద గొంతుకతో అరిచాడు.

ముసలమ్మ కొంచం కూడా తొణకలేదు.. బెణకలేదు.. అంగుళం కూడా బెసగలేదు. కదిలే ఉద్దేశ్యం లేనట్టుగా రాయిలాగా అలాగే కూర్చుని ఉంది.

అర్థించడం మాత్రం మానలేదు.

హరి కోపం అవధులు దాటింది..

“ఇంత పొద్దున్నే నా ప్రాణాలు తీయడానికి ఎక్కణ్ణుంచి వచ్చావ్..? పో... బయటకు పో...” అంటూనే ఆమె రెక్క పట్టుకుని బలవంతంగా లాక్కుంటూ, తలుపు తోసుకుని, ఆమెని బయటకు నెట్టేసి, వెంటనే తలుపు మూసి, గడియపెట్టేసుకున్నాడు.

పొద్దున్న పొద్దున్నే అనుకోని సంఘటన...

స్ట్రెస్.... బత్తిడి... తగ్గించుకోవాలి...

హాలు మధ్యలో నిలబడి...

తలను పూర్తిగా కిందికి దింపి, ఎడమ భుజం మీదుగా బాగా వెనక్కి తీసుకెళ్లి కుడి భుజం మీదుగా ఐదుసార్లు తిప్పాడు. అదే విధంగా మళ్లీ అపోజిట్ డైరెక్షన్‌లో నింపాదిగా, నిదానంగా, ఊపిరి బిగబట్టకుండా, మామూలుగానే శ్వాస తీసుకుంటూ ఇంకొక ఐదుసార్లు తిప్పాడు. తరవాత

నెమ్మదిగా, అతి నెమ్మదిగా తలను ఎంత వెనక్కు వెళ్తుందో అంతగా వెనక్కు, అదే విధంగా ముందుకు పూర్తిగా వంచి, మళ్లీ నార్మల్ పొజిషన్‌కు తెచ్చాడు. తలకు రక్త ప్రసరణ పెరిగి ‘క్లమ్సీనెస్’ పోయినట్లనిపించింది.

ఇక, శరీరం మొత్తానికి ఆక్సిజన్ పెంచాలి... రెండు కాళ్లూ “స్టాండ్ ఎట్ ఈజ్” పొజిషన్‌లో కొంచం దూరంగా పెట్టి, రెండు చేతులూ నడుంకి ఇరువైపులా పెట్టుకుని, ఊపిరి మొత్తంగా ముక్కుతో లోపలికి పీల్చి, ఆపగలిగినంత సేపు ఆపి, నోటితో శబ్దం చేస్తూ...

మెల్లగా... అతి మెల్లగా... మొత్తం పీల్చిన ఊపిరంతా పూర్తిగా వెళ్లిపోయేంత వరకు నోరు తెరిచి వదిలాడు.

అలా ఇంకొక ఐదుసార్లు చేసాడు...

రిలాక్స్... రిలాక్స్... రిలాక్స్... అనుకుంటూ వంట గదిలోకి అడుగుపెట్టాడు.

అంతా శుభ్రంగా ఉంది... అంట్లు అన్నీ శుభ్రంగా తోమి, బోర్లించబడి ఉన్నాయి. పాలు మరిగించి చక్కగా మూత పెట్టబడి ఉన్నాయి.

ఆశ్చర్యానికి గురయ్యాడు హరి...అసలెప్పుడొచ్చింది ముసలామె..? ఇన్ని పన్లు ఎప్పుడు చేసింది, కనీసం చప్పుడన్నా కాలేదే? మెలకువ రాలేదే..? ఏదో విచిత్రంలాగుందే?



జరిగిన కథ :     గోడ గడియారం గంటల శబ్దానికి నిద్రలోంచి మేల్కొంటాడు హరి   .. హాల్లోకి రాగానే కుర్చీపై ఒక ముసలావిడ ఆకారం కనిపిస్తుంది... దాంతో   నిలువునా కొయ్య బారి పోతాడు .

**..................................ఆ తరువాత**

**.....................................................**

ఇంతలోనే ఏదో ఆలోచన వచ్చిన వాడిలాగా, తలుపు తీసి చూసాడు.

ఎవ్వరూ లేరు...

కారిడార్ మొత్తం శూన్యంగా... ఖాళీగా ఉంది.

నర సంచారం లేదు...

అంతా నిశ్శబ్దం... నిర్మానుష్యం...

ఈ ఫ్లాట్‌లు తగలెయ్య... ఎవడికి ఏం జరిగినా... ఎవడు ఎవడిని చంపేసినా, పక్కవాడికి ఎంత మాత్రం తెలియదు. ఏళ్ల తరబడి పక్క ఫ్లాట్‌లోనే ఉంటున్నా వాడెవడో తెలియని పరిస్థితి. ఏదో కమిటీలంటారు, మీటింగులంటారు, లాగ్ బుక్కు లంటారు... ఛ.... అనుకుని, ఈసారి భద్రంగా తలుపు మూసుకున్నాడు. సరిగ్గా అదే సమయం లో ఆకాశాన ఛళ్ళున ఉరుముతో పాటు కొన్ని లక్షలవేల వాట్లతో తళుక్కున మెరుపు మెరిసింది.

ట్రిమ్‌గా తయారయ్యి, ఫ్లాట్ నుండి బయటకు వచ్చి, థర్డ్ ఫ్లోర్ నుండి లిఫ్ట్ లో కిందికి దిగి కారువైపు నడుస్తున్న హరికి ఎదురుపడ్డాడు వాచ్‌మన్ జైరాజు.

డాక్టర్నని గర్వం లేకుండా, ఎదుటి వ్యక్తి చిన్నవాడైనా, పెద్దవాడయినా ప్రేమతో పలకరిస్తాడు. అందుకనే చిన్న వయసులోనే పెద్ద పేరు గడిరచాడు అనుకుంటూ, ‘‘నమస్కారం డాక్టర్ గారూ...’’ అన్నాడు.

‘‘గుడ్ మార్నింగ్ జైరాజ్’’ నవ్వుతూ మనస్ఫూర్తిగా బదులిచ్చాడు హరి.

‘‘ఔనూ... జైరాజ్, ఎవరో ముసలమ్మ పొద్దున్నే నా ఫ్లాట్‌లోకి చొరబడిరది. నువ్వసలు డ్యూటీ సరిగ్గా చేస్తున్నావా? ఎవరుబడితే వాళ్లు ఫ్లాట్లలోకి ఎంటరైపోతున్నారు’’ అన్నాడు మొత్తగా.

నివ్వెర పోయాడు జైరాజ్...

ఆ నివ్వెరపాటుని స్పష్టంగా గమనించాడు హరి.

"సార్... నేను ఉదయం మూడు గంటల నుంచే పని ప్రారంభిస్తాను. తెల్లవారు ఝామునే వచ్చే పేపర్ల వాళ్లూ, పాల వాళ్లూ, ప్రొద్దు పొడవకముందే డ్యూటీలకెళ్లేవాళ్లూ, రాత్రి నైట్ డ్యూటీలు చేసి తెల్లవారకముందే గూళ్లకు చేరుకునే వాళ్లూ, పనిమనుషులూ... ఇలా ఎంతోమంది వస్తుంటారు.. వెళ్తుంటారు... అందర్నీ గమనిస్తాను నేను. నాకు తెలియకుండా... ఒక ముసలమ్మ మీ ఫ్లాట్‌లోకి వచ్చిందా..? ఆశ్చర్యంగా ఉంది డాక్టర్ గారూ... ఇంతకాలమయ్యింది మీరీ ఫ్లాట్‌లోకి వచ్చి... నన్నెప్పుడూ డ్యూటీ సరిగ్గా చేస్తున్నావా? అనలేదు మీరు... సడెన్‌గా మీరీ మాట అంటుంటే నమ్మలేకపోతున్నాను సార్" అన్నాడు జైరాజ్.

"నిజమే... జై రాజ్... కాని జరిగిందాన్ని బట్టి ఆ మాట అనాల్సివచ్చింది, డోంట్ మైండ్..." అంటూనే తన 'వోక్స్‌వేగన్' కారులో బయల్దేరిపోయాడు హరి.

ఆకాశం రోదించినట్లుగా రోడ్లన్నీ తడిసి, జలమయమైపోయి ఉన్నాయి. ఏదో విచారాన్ని వ్యక్తం చేస్తున్నట్లుగా వాతావరణమంతా 'డల్'గా 'గ్లూమీ'గా ఉంది.

హరి నడుపుతున్న కారు ఒక్కసారిగా గుంతలో పడి 'దబ్' మని సౌండ్ చేసింది.

"ఈ హైదరాబాద్ డ్రైనేజి వ్యవస్థను బాగుచేసే నాథుడు ఉన్నాడా? ఎప్పుడు వర్షం వచ్చినా రోడ్లని మునిగిపోతాయి. ఏ గుంతలోపడి కారు నాశనమై పోతుందో తెలియదు. పోయినసారి వర్షాలకి కారు రిపేర్లకి ముప్పైఐదు వేలు ఖర్చయ్యాయి. ఈ 'జిహెచ్ ఎంసి' మీద కేసు వేసి, ఆ బిల్లు వాళ్లతో కట్టిస్తే గాని తెలిసిరాదు. ఏదో 'మాస్టర్ ప్లాన్' అన్నారు... అంతా బాగయిపోతుందని అన్నారు. ఇంతవరకూ దానికి అతీగతీ లేదు" అనుకుంటూ నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నాడు...

ఇంతలో.... పెద్ద గోతిలో పడి, ఎవరో పట్టి విసిరేసినట్లుగా ఒక్కసారిగా కారు ముందు భాగం పైకి లేచింది. స్టీరింగ్‌ని జాగ్రత్తగా కంట్రోల్ చేస్తూ... బలమంత వినియోగించి, బ్రేకుపై కాలు అదిమిపెట్టి తొక్కేటప్పటికి... ఫెళ ఫెళమని శబ్దంతో... బ్రేకు వైరు తెగిపోయినట్టుగా అనిపించింది హరికి.

ఒక్కసారిగా.... కారు అడ్డంగా తిరిగి, రోడ్డు మధ్యలో ఆగిపోయింది. గుబగుబ లాడుతున్న గుండెలతో ఏమీ చెయ్యాలా... అని ఆలోచించేలోపే, పదిమందీ చేరడం, కారును రోడ్డు పక్కకి తోసేయడం, 'ఆటో'లో హరిని 'డ్యూటీ'కి పంపడం, చకచకా జరిగిపోయాయి.

గుడ్ మార్నింగ్ డాక్టర్...

గుడ్ మార్నింగ్..

మార్నింగ్ సార్...

మార్నింగ్...

విష్ చేస్తున్న వారికందరికీ చిరునవ్వుతో బదులిస్తూ తన ఛాంబర్ వైపు అడుగులేస్తున్నాడు 'హరి' ఆరడుగులకు రెండంగుళాల తక్కువ హైటు, రన్నింగ్, ఏరోబిక్స్ లతో కండిషన్‌లో ఉన్న బాడీ, తెల్లని దేహచ్ఛాయ, ప్రపోర్షనేట్‌గా ఉన్న ముఖం, ఆ ముఖానికి సరిపోయే ఎత్తయిన నాసిక, చక్కని ముఖ కవళికలు, వర్చస్సు వాటిని ద్విగుణీకృతం చేసే చిరునగవు గౌరవాన్ని మరింత పెంచుతుండగా.. ముందుకు సాగుతున్నాడు.

ఎదురుగ్గా వచ్చి స్టిఫ్‌గా నిలబడి మిలటరీ సెల్యూట్ కొట్టాడు సెక్యూరిటీ డేవిడ్. డేవిడ్ మిలటరీ నుంచి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని, ఈ మధ్యనే సెక్యూర్టిగా చేరాడు.

కొద్దిగా తలవంచి, కుడిచేతికి ఏటవాలుగా పైకిలేపి, మిలటరీ జనరల్ సెల్యూట్ స్వీకరించిన విధంగా సెల్యూట్ చేస్తూ తన ఛాంబర్ లోకి వెళ్ళిపోయాడు 'హరి'

ఈలోగా, నెమ్మదిగా 'డేవిడ్' పక్కన చేరాడు వార్డుబాయ్ 'వేణు'. ''డాక్టర్ 'హరి'ని చూడగానే వెలిగిపోతున్న మొహాలతో పోటీలు

పడి మరీ 'విష్' చేస్తారీ నర్సులు. మరి డాక్టర్ 'సుందర్' కనబడితే ఏదో తప్పదన్నట్లుగా విష్ చేస్తారెందుకు'' డేవిడ్‌కి మాత్రమే వినబడేలా గొణిగాడు.

సాలోచనగా 'వేణు' వైపు చూసాడు 'డేవిడ్'

''నువ్వన్నది నిజమే.. డాక్టర్ హరి అందగాడు... అందంగా ఉన్న వాళ్లని చూస్తే ఆనందంగానే ఉంటుంది అందరికీ... 'అందమె ఆనందం' అన్నారు. అందంగా ఉన్నవాళ్లకి బ్రహ్మరథం పట్టి, మీరు అందంగా ఉన్నారని ఆడవాళ్లకైనా, మగవాళ్లకైనా సరే... పదే పదే చెప్పి, వాళ్లతో ఫ్రెండ్‌షిప్ చెయ్యడానికి ముందుకొస్తారు. ఇదే మనుషులు, అందంగా లేనివారిని చూసి అసహ్యించుకుంటారు. అనాకారులు ఎంత మంచి వాళ్లయినా సరే వాళ్లతో సూటిపోటీ మాటలతో అవకాశం దొరికినప్పుడల్లా వికారితనాన్ని ఎత్తిచూపి, పైశాచికమైన ఆనందం పొందుతారు. ఉదాహరణకు... డాక్టర్ 'సుందర్' వెనకాల పేరుకే 'సుందర్' కానీ మనిషికి సుందరత్వం ఏమాత్రం లేదు అని ఆయనకు వినబడేలా కామెంట్ చేస్తారు.

ఈ విధమైన అవహేళనలను జీర్ణించుకోలేక, ఈ ప్రపంచమంతా తమకు వ్యతిరేకత చూపిస్తుందని అందంగా లేని వాళ్లు అర్థం చేసుకుని, తమ లోని మంచి తనాన్ని గుర్తించలేని ఈ వికృత సమాజాన్ని ఎదుర్కోవడానికి 'ఇరిటేటింగ్'గా ప్రవర్తిస్తారు. అంటే, మనం మన దుష్ప్రవర్తనతో ఎదుటివారిని చెడ్డవాళ్లుగా మార్చడమే కాక, పైగా వాళ్లపై రకరకాల ముద్రలు వేస్తున్నాము.మా మిలటరీ లో ఇలా ఉండదు. ఎదుటివాడి శక్తి సామర్థ్యాల బట్టే గౌరవ మర్యాదలుంటాయి. ఎత్తిపొడుపు మాటలు, ఎకసెక్కాలూ, కించ పరచటాలూ ఉండవు. పని... పని ముఖ్యం.. ఎవడు బాగా పనిచేస్తే వాడికే గౌరవం. పేరుకే 'సివిల్ సొసైటీ' మీది. మీ సొసైటీలో ఉన్న జాడ్యాలూ, రుగ్మతలూ మా మిలటరీలో ఉండవు. పేరుకు 'సివిల్ సొసైటీ' కాని నిజానికి 'మోస్ట్ అన్ సివిలైజ్డ్ సొసైటీ' మీది అన్నాడు డేవిడ్.

''ఏం చెప్పావ్ డేవిడూ..'' అన్నాడు వేణు.



జరిగిన కథ : రాత్రి పడుకున్న దగ్గర్నించి ఉదయం లేచిన తరువాత జరిగే చిత్ర విచిత్రమైన అనుభవాలతో కొంత అయోమయానికి గురవుతాడు డాక్టర్ హరి. హాస్పిటల్ కి వెళ్ళగానే ఎప్పట్లానే నర్సును, మిగతా స్టాఫంతా విషెస్ చెప్తారు..................

........................................ ఆ తరువాత

“ఇందులోనూ వేళాకోళమా..? నేను కూడా నీతో ఏకీభవించి, డాక్టర్సుందర్నీ హరినీ పోల్చి, సుందర్గారిని తక్కువ చేసి ఉంటే సంతోషించి ఉండేవాడివేమో?”

“అబ్బెబ్బే… అదేం లేదు డేవిడూ.. నా ఉద్దేశం అది కాదు” అంటూ చల్లగా జారుకున్నాడు వేణు. వెధవలు… వెధవ బుద్ధులు… అనుకున్నాడు డేవిడ్.

మధ్యాహ్నం ఒంటిగంట కావొస్తోంది..పేషంట్లందరినీ చూసి, పంపించేసాడు ‘హరి’..

కడుపులో ఆకలి దహించేస్తుంది… కర .. కర.. మంటూంది.

హమ్మయ్య… కేంటీన్లో భోజనం తెప్పించుకుందా మనుకునే లోపు ఫోన్మోగింది…

“సర్… ఇంకో పేషెంట్ఉన్నారు…”

“తర్వాత చూద్దాం లెండి..”

“మిమ్మల్ని చూడాలని మరీ మరీ రిక్వెస్ట్ చేస్తున్నారు సర్”

“అపాయింట్మెంట్తీసుకున్నారా?”

“లేదు సార్.. ఎక్కువ సేపు తీసుకోనని, ఒక్కసారి కలవాలని అంటున్నారు సర్… కొత్త పేషెంట్”

“సరే.. సరే… ముందు కేస్పేపర్పంపించండి…”

“ఓకే సర్..”

“కూర్చోండి మేఘన గారూ…

చెప్పండి… ప్రాబ్లమేమిటో..”

కేస్పేపర్చూస్తూ, తలెత్తకుండానే అన్నాడు ‘హరి’

అవతలి నుంచి సమాధానం లేదు…

తలెత్తి పేషంటు వైపు చూసాడు…

సన్నని చిరునవ్వుతో తననే తదేకంగా చూస్తున్నదామె… హరి తన వైపు చూడడంతోనే, ఏం మాట్లాడకుండా… తన కుడి చేతిని ముందుకు చాచిందామె.

‘మణికట్టు’ చుట్టూ, ఎర్రగా కమిలిపోయి, రక్తం కారి, గడ్డకట్టుకుపోయి ఉంది.

ఈలోగా ఎడమచేతిని కూడా ముందుకు చాచిందామె..

ఆ చేయి పరిస్థితి కూడా అలాగే ఉంది.

“తామర తూడులాంటి ఈ కోమల హస్తాలను ఇంత నిర్దాక్షిణ్యంగా నలిపేసినవారు మనుషులా..? రాక్షసులా..? లేక, ఈమే తనను తాను హింసించుకుని ఆనందించే మాసోఖిస్టా..? వాలకం చూస్తే అలా లేదే..?” అనుకుంటూ చకచకా సెలైన్ తో శుభ్రం చేసి, ఆయింట్మెంట్ అప్లై చేసేసాడు.

అలవాటుగా నాడీ, బీపీ చెక్చేసాడు.

“కట్టు కట్టాల్సిన పనిలేదండీ.. గాలి తగలనిస్తే త్వరగా తగ్గిపోతుంది” అన్నాడు.

ఈలోపు, తను కూర్చున్న స్టీలు రివాల్వింగ్స్టూల్మీద డాక్టర్కు తన వీపు కనబడేలా తిరిగి, మెడ చుట్టూ కప్పుకున్న పమిటను తొలగించిందామె.

ఇంకోసారి షాక్కు గురైయాడు ‘హరి’

ఇదేమిటి?

మెడ చుట్టూ… వలయంలా… ఎవరో తడిగుడ్డతో గొంతు బిగించి, ఉరివేసినట్లుగా… నల్లగా కమిలిపోయి, నలిగి ఉంది చర్మం…“సన్నగా, పొడవుగా… తెల్లగా.. శఖంలాగా ఉన్న ‘మెడ’పై ఇలాంటి గాయమా? ఎవరైనా ఉరి తీసి చంపేయడానికి ప్రయత్నించారా? లేక ఈమె ఆత్మహత్యాప్రయత్నం చేసిందా?” అనుకుంటూ, నెమ్మదిగా చేతి వేళ్లతో మెడను స్పృశించాడు.

పేషెంట్ నుండి ‘స్పందన’ లేదు.

ఇంకొద్దిగా చేతివేళ్ల ఒత్తిడి పెంచి “నొప్పి ఉన్నదాండీ..” అన్నాడు.

“లేదు డాక్టర్” అన్నదామె.

“నొప్పి లేదంటే, మెడ ఎముకలకేమీ దెబ్బ తగిలి ఉండదు. ఒకవేళ ఎముకలకేమైనా అయి ఉంటే కేవలం ‘టచ్’ చేసినప్పుడే కేకలు పెట్టి ఉండేది. ఇంత ప్రశాంతంగా కూర్చోలేదు” అనుకుంటూ తలెత్తి చూసాడు.

ఎప్పుడు ఆమె మళ్లీ ముందుకు తిరగిందో కానీ, హరి వైపు తిరిగి, ముఖంలో ముఖం పెట్టినట్లుగా సూటిగా అతని కళ్లల్లోకి చూస్తున్నదామె.గతుక్కుమన్నాడు ‘హరి’... కొంచం సర్దుకుని, ఆమెతో చూపు కలిపాడు.

అదే చిరునవ్వులో ఏ మాత్రం తత్తరపాటు లేకుండా తదేకంగా చూస్తున్నదామె.

“ఏమిటి? ఎందుకలా చూస్తున్నదామె?ఆ చూపుల్లో ఏదో ఆర్తి, ఆర్ద్రత వ్యక్తమవుతున్నాయి. ఏమో...! ఆమె మామూలుగానే చూస్తున్నదేమో..? నేనే రకరకాల బాష్యాలు చెప్పుకుంటున్నానేమో..?

కాదు... కాదు... ఏదో ఉంది... ఆ ఆర్తి... ఆర్ద్రత... అబద్దాలు కావు. అయినా ఒక పేషంటు గురించి ఎందుకిలా పరిపరి విధాల ఆలోచిస్తున్నాను నేను?

“తీగలాంటి దేహం కలిగి, చక్కని మేని ఛాయతో, రూపురేఖలతో, తన సమక్షంతో ఎదుటివారిపై వెన్నెల హాయిని కురిపించి, తన చిరునవ్వుతో ప్రపంచాన్ని మరిపింపజేసే... ఈమెపై ఇంత రాక్షసంగా.. కర్కశంగా... కక్షగా.. కౄరత్వాన్ని కురిపించిన రాక్షసాధముడెవడు? వాడసలు మనిషేనా? పశువా? కౄరమృగమా? బంధువా? భర్తా?” ఆలోచనలతో హరి బుర్ర వేడెక్కుతుండగా...

“భర్త... నా భర్త...” అన్నదామె వినబడీ వినబడనట్లుగా

“ఏమిటీ... నా ఆలోచనలు ఈమె కళ్లకు కనబడుతున్నాయా..! సరిగ్గా పుస్తకం చదివినట్లుగా నా మనసులోని భావాలు ఎలా చదవగలిగింది?”

కలవరపాటును కప్పిపుచ్చుకుంటూ... గంభీరంగా... ఆఁ... ఏమన్నారు... మేఘనగారూ... అన్నాడు.

“నా భర్త వల్లనే నాకీ గాయాలయ్యాయని అంటున్నాను డాక్టర్” ఏ భావమూ లేకుండా అన్నదామె.

“ఓహ్ ౦ ా... ఐయామ్సారీ.... మీ గాయాలు త్వరగానే మానిపోతాయి. నేనిచ్చిన ఆయింట్మెంట్కంటిన్యూ చేయండి.

ఏంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ రాసాను. కేవలం మూడు రోజులు వాడండి. ఎక్కువ రోజులు వాడకండి.. నొప్పి అనిపిస్తేనే. ఆ తర్వాత కూడా ఒక్క రోజు మాత్రమే పెయిన్ కిల్లర్స్ వాడండి. అంతకీ నొప్పి ఎక్కువైతే డామేజ్ ఆసెస్ మెంట్ కోసం ఎక్స్ రే, మిగిలిన టెస్టులు చేయిద్దామండి. నా ఉద్దేశంలో పెద్దగా డామేజి లేదు. అవసరమైతేనే టెస్టులు... అనవసరంగా మనీ వేస్ట్చేయడమెందుకండీ. వచ్చే వారం ఒక్కసారి కన్పించండి.” చెప్పేసాడు హరి.

“థ్యాంక్యూ డాక్టర్...” అంటూ అదే చిరునవ్వుతో హంస గమనంతో, మరు నిమిషంలో కనుమరుగయ్యిందామె.

“వెళ్లిపోయిందా? మాయమైపోయిందా?” అనుకున్నాడు. కానీ తననే చూస్తూ ఆశ్చర్యంతో నోరు వెళ్లబుచ్చుకున్న నర్సుని గమనించలేదు డాక్టర్ హరి.

సాయంత్రం ఏడు గంటల సమయం...



జరిగిన కథ : పేషెంట్లను చూడడం పూర్తయిన డా.హరి ఆకలితో భోజనానికి సిద్ధమౌతుండగా ఎవరో కొత్త పేషెంట్ వచ్చినట్టు చెబుతుంది రిసెప్షనిస్ట్. రెండుచేతుల మణికట్ల మీదా, మెడ మీదా నల్లని చారలు చూపిస్తుందామె. ఆయింట్ మెంట్ రాసిచ్చి తగ్గిపోతుందని చెప్తాడు ఆమెకు......................

..........................ఆ తర్వాత

ఐనా గానీ, అప్పటికే చీకట్లు కమ్ముకున్నాయి..

ధారగా వర్షం కురుస్తున్నది. వీధి దీపాలు వెలగ డం లేదు... ఇంతలో ఒక పెద్ద ఇనుపగోళం బడబడా.. దడదడా మంటూ పెద్ద ధ్వనితో ప్రతి ధ్వనితో ఆకాశం నుండి జారుతూ, మేఘాలను చీల్చుకుంటూ... భూమి వైపు ప్రయాణం చేస్తున్నది.

భూమి మీద ఉన్న వారికెవరికైనా ఇట్టే అర్థం అయిపోతుంది. ఆ పెద్ద గోళం కాసేపట్లో భూమిపై పడబోతోందని.

ఆ వాతావరణంలో కారు నడుపుతున్న హరికి ఈ గోళమేదో తననే తరుముతున్నట్లుగానూ, తనపై పగబట్టి, తన కారుపైనే పడబోతున్నట్లు గానూ, అకస్మాత్తుగా అనిపించింది. వెన్నెముకలో నుండి చలిపుట్టుకువచ్చి, శరీరం చిగురుటాకులా కంపించనారంభించింది.

ప్రాణ భయం గుండెను నలిపేసి, గొంతును పిసికేస్తుండగా, అప్రయత్నంగా... పెద్ద గొంతుకతో.. ''అర్జునా... ఫల్గుణా... కిరీటీ... రక్షించు తండ్రీ'' అంటూ బిగ్గరగా అరిచాడు.

ఈలోపు ఉరుముతో కూడిన పిడుగు పడనే పడిరది.

కనుచూపు మేరలో రోడ్డుపక్కనే ఉన్న పెద్ద భూతాల మర్రిచెట్టు, దేవేంద్రుని వజ్రాయుధంతో బలంగా నిలువునా నరికినట్లుగా నిట్టనిలువుగా చీలిపోయి, భగ్గు భగ్గుమంటూ రావణకాష్టంలా కాలిపోనారంభించింది.

గుండె గుబేలుమంది హరికి.. కొద్దిగా అటూఇటూ అయి ఉంటే..? నాయనమ్మ మాటలు గుర్తొచ్చాయి.

అర్జునుడు ఆకాశంలో రథంపై వెళ్తుండగా అనుకోకుండా రథచక్రం యొక్క చీల (బోల్టు) ఎక్కడో జారి పడిపోతుంది. ఆ సమయంలో అర్జునుని రథచక్రం చేసే శబ్దమే ఉరుము ఆ చీల (బోల్టు) నేల మీద ఎక్కడ పడితే అదే పిడుగు. అర్జునుడికి గల మారు పేర్లు ఫల్గుణుడు, కిరీటి.. ఆ అర్జునుడిని వేడుకుంటే మనలను రక్షిస్తాడు.''నిజంగానే రక్షించావు అర్జునా'' పైకే గట్టిగా అన్నాడు.

''ఈ రఘుగాడు 'కరీంనగర్'లో ఇల్లు కట్టనేల? ఈ రోజే గృహ ప్రవేశం పెట్టుకోనేల? సాయంత్రం ఏడిరటికి బయల్దేరినా ఫర్వాలేదు పదిగంటలకల్లా వచ్చేస్తావు అని నన్ను పిలవనేల? పిలిచాడు పో.. నేను బయల్దేరనేల? ఈ భయంకర వాతావరణంలో ఒంటిరిగా చిక్కుకోనేల? అసలివ్వాళ చేరగలనా?

ఎంత దూరం వచ్చాను? ఇంకెంత దూరం ఉంది? ఒక మాదిరి వేగంతో కారు నడుపుతూ పరి పరి విధాలా వాపోతున్నాడు హరి.ఇంతలో.. చిత్రవిచిత్రమైన శబ్దాలు చేస్తూ… కుదుపుల మీద కుదుపు లివ్వడం మొదలుపెట్టింది కారు.

ఇదేదో చతికిలబడేలా ఉందే… అని అనుమానించి, వెనుక వచ్చే వాహనాలకు అడ్డు లేకుండా డ్రైవ్‌చేయడం మొదలుపెట్టాడు. ఊహించినట్టుగానే కాస్త దూరం పరిగెట్టి ఒక పెద్ద జర్క్‌ ఇచ్చి ఆగిపోయింది కారు.

కురుస్తున్న వర్షంలోనే కారు దిగి, బోనెట్‌తెరచి, తోచిన మంత్రాలన్నీ వేసాడు. ఎన్నిసార్లు స్టార్ట్‌ చేసినా స్టార్ట్‌ కాకుండా మొరాయించింది కాదు. నువ్వెన్ని మంత్రాలు వేసినా నేను లొంగను అన్నట్టుగా భైతాయించింది.

“పొద్దునే కదా షెడ్‌కు వెళ్లి వచ్చింది? వోల్క్స్‌ వేగనో, ఫోల్క్స్‌ వేగనో… దీని పేరు తగలెయ్య.. జర్మన్‌కారంట, టెక్నాలజీకి జర్మనీ పెట్టింది పేరంట.. పైగా కొత్త కారు… దీనికేం పోయేకాలం? ఈ సర్వీసింగ్‌సెంటర్ల వాళ్లని నమ్మకూడదు.. అంతా పర్‌ఫెక్ట్‌ అంటారు, వేలకు వేలు బిల్లు వేస్తారు..

తీరా చూస్తే కారు బాగుపడిరదో లేదో ఆ దేవుడికే ఎరుక.

అందుకనేమో… ఈ సర్వీసింగ్‌సెంటర్‌వాళ్ల బాధ పడలేక ఒళ్ళుమండి, విసిగిపోయి, కోటి రూపాయలకు పైగా విలువచేసే కొత్త కారును పబ్లిగ్గా పెట్రోలు పోసి తగలబెట్టాడంట ఒక చైనా వాడు. ఈ మధ్యనే హైదరాబాద్‌లో ‘బెంజ్’ కంపెనీ వాళ్ళు కూడా సర్వీసింగు పొడిచింది లేకపోగాఅన్యాయంగా వేలకు వేలు సర్వీసింగు పేరుతో గుంజుతున్నారని పేపర్లన్నీ కోడైకూసాయి. వెధవలు… వెధవలు” తిట్టుకుంటూనే గ్లోవ్‌బాక్స్‌ లోంచి ఆల్‌రెడీ మిక్స్‌ చేసి ఉన్న విస్కీ బాటిల్‌తీసి నాలుగు గుక్కలు గుటుక్కున మింగి, సిగరెట్‌వెలిగించాడు. కొంచం వెచ్చగా, కంఫర్టబుల్‌గా అనిపించింది. మనసులోని ఆందోళన కొద్దిగా నెమ్మదించింది. వర్షం సన్నగా, ధారగా కురుస్తూనే ఉన్నది. అసలు ఈ ఏరియా ఏమిటి? ఎక్కడ వరకూ వచ్చానో తెలుసుకుందామని అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టాడు.

అంతలోనే ఏదో బురదలో కాలు పెట్టి పీకలదాకా కూరుకుపోయినట్లనిపించింది. బట్టలని బురద.. తల తడవకుండా కాపాడుకుంటూ వేసుకున్న జర్కినుకున్న టోపీని బైటికి లాగి నెత్తిమీద కప్పుకున్నాడు. ఏదో జరిగింది… ఏం జరిగిందో తెలియడం లేదు… ఏదో ఆందోళన… మళ్లీ కారు దగ్గరకు వచ్చి, విస్కీ బాటిల్‌తీసి గొంతులోకి వంపుకున్నాడు… అంతకు ముందు వెలిగించిన సిగరెట్ పూర్తిగా తాగిన గుర్తు లేదు… వర్షానికి తడిసిపోయిందేమో అనుకుంటూ మళ్లీ సిగరెట్‌వెలిగించి గుండెల నిండా దమ్ములాగాడు. విస్కీ బాటిల్‌ను జేబులోనే పెట్టుకున్నాడు. వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తూనే ఉంది.

ఏవైనా వెళ్లే పోయే వాహనాలను ఆపుదామని రోడ్‌మీదకు వచ్చి ఎంతసేపు చూసినా లాభం లేకపోవడంతో కారు దగ్గరకు తిరిగి వస్తూ చుట్టూ చూసాడు... మసక మసకగా ఉంది. ఏమీ కనబడటం లేదు.

అదే సమయంలో... ఆకాశలో ఒక్కసారిగా ఉరుముతో కూడిన మెరుపు మెరిసింది.

ఆ మెరుపు వెల్తురులో...

క్షణకాలం ఒక స్త్రీ ఆకారం తళుక్కుమని మెరిసి మాయమైపోయింది.

భ్రమా... నిజమా...? నిశ్చేష్టుడైపోయాడు హరి.

వర్షానికి తడిసిపోకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ పీలుస్తున్న సిగరెట్‌ని విసిరిపారేసాడు హరి. లైటు కావాలి... తనకు కనిపించింది నిజమేనా..? కళ్ళు చికిలించి చూసినా ఏమీ కనబడటం లేదు. ఇంతలో గుర్తొచ్చింది... సెల్‌ఫోన్... అరే.. అనవసరంగా ఇన్ని తిప్పలు పడకపోతే, ఒక్క కాల్‌చేసి ఉంటే రఘు వచ్చి పికప్‌చేసుకునే వాడు కదా... తనకు తానే తిట్టుకుంటూ జేబులోంచి సెల్‌ఫోన్ తీసాడు. సెల్‌టవర్‘జీరో’ చూపిస్తున్నది... అదృష్టవశాత్తూ సెల్‌ఫోన్‌ఆన్‌అయ్యి లైట్‌వస్తున్నది. ఆ లైటు వెల్తురులోనే చుట్టూ చూడటానికి ప్రయత్నించాడు.

దూరంగా ఒక లైటు... బాటరీ లైట్‌లా ఉంది...

నిదానంగా... తనవైపే వస్తున్నది...

ఇంతలో సెల్‌లైట్‌ఆగిపోయింది. మళ్లీ ఆన్‌చేసాడు... సెల్‌ఫోన్‌వెల్తురులో కళ్ళు చికిలించి చూసాడు...

ఎవరో… బాటరీ లైట్‌పట్టుకుని తనవైపే వస్తున్నారు… మనిషి కనబడటం లేదు పూర్తిగా… కానీ… చూచాయగా… ఆడ మనిషి అని తెలుస్తున్నది… కొరివి దయ్యం కాదు కదా…?

నెమ్మదిగా… ఆ ఆకారం హరిని సమీపించింది…

లైటు హరి మీదకు ఫోకస్‌చేస్తూ…

“ఎవరండీ మీరు? ఈ సమయంలో, ఇక్కడ ఏమి చేస్తున్నారు?” అంటూ ప్రశ్నించింది.

ఈ స్వరమెక్కడో విన్నట్టుందే… అనుకుంటూ ఆరిపోయిన సెల్‌లైట్‌ని మళ్లీ వెలిగించి ఆ ఆకారం మీదకు ఫోకస్‌చేసాడు…

“మేఘన గారూ… మీరా…?”

“డాక్టర్‌గారూ… మీరా…?”

“ఈ సమయంలో మీరిక్కడ..?”

ఆశ్చర్యంతో ఒకరినొకరి పలకరించుకున్నారు. తను ఏ విధంగా ఆ ప్రాంతంలో చిక్కుకున్నాడో ఆమెకు వివరించాడు హరి.

“మీరెలా..? ఇక్కడ? వెరీ సర్‌ప్రైజింగ్..!” అన్నాడు

“మా ఇంటికి మీరొచ్చి సర్‌ప్రైజింగ్‌అంటారేమిటి?”

“మీ ఇల్లా…! ఇక్కడా..!”

“డాక్టర్‌గారూ… మీరెక్కడున్నదీ మీకు తెలియడం లేదు. కన్‌ఫ్యూజన్‌లో ఉన్నట్లున్నారు… అదిగో… కూతవేటు దూరంలో కరీంనగర్… ఊరి చివర మా ఇల్లు… అంటే… మా పిన్నమ్మ గారిల్లు… మీరు ఇప్పుడున్న పరిస్థితుల్లో కరీంనగర్‌వెళ్లలేరు… కరెంటు కూడా లేదు… ఎప్పుడొస్తుందో తెలియదు.. వర్షం కురవడం మొదలుకాగానే కరంటు తీసేస్తారు… ప్రమాదాలు జరుగుతాయనే భయమో లేక నెపమో…? మీరీపూట ఇక్కడే ఉండి, రేపు ఉదయాన్నే వెళ్లడం మంచిది… బాగా తడిసి ఉన్నారు… తరువాత మీ ఇష్టం…” అంటూనే గిరుక్కున వెనుదిరిగి, వడి వడిగా అడుగులు వేయడం ప్రారంభించింది మేఘన.